క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి


పత్తేబాద కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ చేశారు. వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. అమ్మవారికి శ్రీ ధనలక్ష్మి అలంకరణ చేశారు. పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీ లలితా సహస్ర నామ పారాయణ చేశారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

అప్రమత్తంగా ఉండండి

ఏలూరు టౌన్: వాతావరణ మార్పులతో వచ్చే టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ప్రజలకు సూచించారు. ఆయన రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ మెషీన్‌ను పరిశీలించారు. డెంగీ, టైఫాయిడ్ వ్యాధుల బారిన పడి రక్తంలోని ప్లేట్లెట్ల సంఖ్య తగ్గిపోవడంతో సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ దాతల కొరత ఏర్పడుతుందని, సమయానికి ప్లేట్లెట్స్ దాతలు దొరకకపోతే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు. స్వచ్ఛందంగా ప్లేట్లెట్స్ దానం చేసేవారు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ ఫోన్‌నెంబర్ 08812 224722లో సంప్రదించాలని కోరారు. రెడ్ క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్లు వరప్రసాదరావు, జి.స్పందన, పీఆర్‌ఓ కేవీ రమణ పాల్గొన్నారు.

3 నుంచి 'పొలం పిలుస్తోంది'


పోస్టర్ విడుదల చేసిన మంత్రులు

ఏలూరు (మెట్రో): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఉద్దేశించిన వ్యవసాయ విస్తరణ కార్యక్రమం 'పొలం పిలుస్తోంది' పోస్టర్‌ను మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ ఏలూరు జెడ్పీ సమావేశ మందిరం లో శుక్రవారం రాత్రి విడుదల చేశారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ఆ రెండు రోజుల్లో నాలుగు గ్రామాలను సందర్శించి రైతులకు తగిన సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, కలెక్టర్ కె.వెట్రీ సెల్వి, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

న్యాయసేవాధికార సంస్థకు ముగ్గురు సభ్యుల నియామకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా న్యాయసేవాధికార సంస్థకు నూతనంగా ముగ్గురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్, లెజిస్లేటివ్ ఎఫైర్స్ కార్యదర్శి వి.సునీత ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌గా జిల్లా జడ్జి పురుషోత్తం కుమార్, కార్యదర్శిగా కె.రత్నప్రసాద్‌లతో పాటు ఈ ముగ్గురు సభ్యులు సేవలు అందిస్తారు. ఈ సభ్యుల్లో సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు, ప్రముఖ న్యాయవాదులు కానాల రామకృష్ణారావు, అబ్బినేని విజయకుమార్ ఉన్నారు.

బంగారం చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు వట్లూరు ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్లూరు గ్రామం శౌరిపురంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. శౌరిపురానికి చెందిన అత్యూరు అన్నమ్మ ఈ నెల 22న వ్యక్తిగత పనులపై ఊరెళ్లి.. 25న తిరిగి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 3 కాసుల బంగారు అభరణాలు అపహరించారు. త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

పడకేసిన ఇళ్ల నిర్మాణ పనులు

- మంజూరుకాని బిల్లులు
- లబ్ధిదారుల్లో ఆందోళన
- దరఖాస్తు కోసం ఓపెన్‌కాని వెబ్‌సైట్


పోణంగిలో నిలిచిపోయిన ఇళ్లు

ఏలూరు రూరల్ : పేదల సొంతింటిపై పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలయినా ఒక్క లబ్ధిదారుడికి కూడా హౌసింగ్ బిల్లులు విడుదల చేయలేదు. కొత్తవారు దరఖాస్తు చేసుకునేందుకు వీలులేకుండా ప్రభుత్వం జగనన్నకాలనీ ఇంటి నిర్మాణ మంజూరు వెబ్‌సైట్ క్లోజ్ చేసింది. నిధులు మంజూరు ప్రక్రియ సైతం నిలిచిపోయింది. ఏలూరు నగరం, రూరల్ గ్రామాల్లో 309 మంది లబ్ధిదారులు ప్రభుత్వం అందించే బిల్లులు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వీరికి సుమారు రూ.5 కోట్లు విడుదల చేయాలి. మరోపక్క ఏలూరు, దెందులూరు ప్రజా ప్రతినిధులు ఆదేశాల మేరకు హౌసింగ్ అధికారులు హౌసింగ్ స్కీమ్‌పై విచారణ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో లోను మంజూరైనా పేదల ఇళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

లబ్ధిదారులు అప్పులపాలు

కూటమి ప్రభుత్వం రెండు నెలల పాటు బిల్లులు విడుదల చేయకపోవడంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కొద్దిమంది లబ్ధిదారులు అప్పు చేసి పనులు నిర్వహిస్తున్నారు. మరి కొందరు పేదలు అప్పులు చేయలేక చేతులెత్తేశారు. ఇక చేసేది లేక తాపీ మేస్త్రీ, కూలీలు నిర్మాణ పనులు వదిలిపెట్టి, ఇతర పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం తాజాగా డిసెంబర్ 31న బిల్లులు మంజూరు చేస్తామని చావుకబురు చల్లగా చెప్పింది.


కొమడవోలులో బేస్‌మెంట్‌కే పరిమితమైన ఇళ్లు


చొదిమెళ్లలో బేస్‌మెంట్‌తో నిలిచిపోయిన ఇళ్లు

జగన్ హయాంలో రూ.కోట్లు విడుదల

గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో హౌసింగ్ శాఖకు రూ.కోట్లు విడుదల చేశారు. 2023 నవంబర్ నెలాఖరి నాటికి ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 1,088 మంది సొంతిళ్లు కట్టుకున్నారు. వీరికి ప్రభుత్వం రూ.12,77,81,000 అందజేసింది. బేస్‌మెంట్ లెవెల్‌లో రూ.70,000, రూఫ్‌లెవెల్‌లో రూ.37,600, రూఫ్ కాస్ట్ రూ.21,200, నిర్మాణం పూర్తిచేసే దశలో రూ.21,200లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. దీనికితోడు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతనం రూ.30,000 అందించింది. దీనికి తోడు మరో రూ.30 వేలు లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల నుంచి అప్పుగా అందించింది.

కట్టలేక నిర్మాణం నిలిపేశాం



సొంత డబ్బుతో ఇల్లు కట్టుకునే స్తోమత లేదు. ప్రభుత్వం బిల్లులు ఇస్తేనే కట్టగలం. రెండు నెలలుగా బిల్లులు వేయలేదు. కనీసం వారానికి ఒక్కసారైనా కూలి డబ్బులు చెల్లిస్తేనే పనులు చేస్తామని కూలీలు చెప్పేశారు. అప్పు చేసి ఇల్లు కడదామన్నా, ఇచ్చే నాథుడే కనబడడం లేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే ఇల్లు కట్టుకుంటాను. లేకపోతే అలాగే ఉండిపోతుంది.

– సీహెచ్ రంగమ్మ, వెంకటాపురం

ఎక్కడి పనులు అక్కడే



సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు మా డివిజన్‌లో పేదలు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగించారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం యజ్ఞంగా సాగింది. బిల్లులు ఎప్పటికప్పుడు విడుదలయ్యాయి. పేదలు సంతోషంగా పనులు చేసుకున్నారు. ఇప్పుడు ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం పేదలను ఇబ్బంది పెట్టకూడదు. బిల్లులు చెల్లిస్తేనే పనులు చేసుకోగలరు.

– తంగెళ్ల రాము, కార్పొరేటర్

1న నిరసన కార్యక్రమాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలుకు తలపెట్టిన ఏకీకృత పెన్షన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఈ పథకాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై సెప్టెంబర్ 1న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఒన్‌టౌన్‌లోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల ఏర్పాటు నిమిత్తం శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేపీబీ నటరాజన్ తెలిపారు. వెన్నవల్లి వారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టి వారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఏలూరు (టూటౌన్): సెప్టెంబరు నెల సామాజిక భద్రత పింఛన్లు ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం నుంచే ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పంపిణీ చేయనున్నట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. 28వ డివిజన్ దుర్గమ్మ గుడి సెంటర్, బీడీ కాలనీ, తంగెళ్ల మూడి 2వ వార్డు సచివాలయం వద్ద, 50వ డివిజన్ రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద, పెనియల్ చర్చి ఎదురుగా రోడ్డు తంగెళ్లమూడి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ఏలూరు (టూటౌన్) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. వనం – మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక పంపుల చెరువు గట్టు ప్రాంతంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వనమహోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యుడు పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం

ఏలూరు టౌన్ : మనిషి సంతోషంగా జీవించాలంటే మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని ఇవ్వటానికి మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

మొక్కలతో ప్రాణవాయువు

భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శర్మిష్ట మాట్లాడుతూ మొక్క వదిలే స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల ఆరోగ్యపరంగా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయ వివరించారు. ప్రతి ఒక్కరి ఇంటి ముందు కనీసం ఒకటి మొక్కైనా నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మురళీకృష్ణ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఏలూరు (టూటౌన్): పంపుల చెరువు గట్టు వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే చంటి


ఏలూరు టౌన్ : మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

కాలుష్యాన్ని నిర్మూలిద్దాం

ఏలూరు(మెట్రో): మొక్కలు నాటాలి కాలుష్యాన్ని నిర్మూలించాలనే నినాదంతో ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి కోరారు. శుక్రవారం వన మహోత్సవములో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఆమె మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 30న వనమహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఒక్క రోజులోనే జిల్లాలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే ఈరోజు కలెక్టరేట్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని జేసీ తెలిపారు. జిల్లాలో 547 పంచాయతీలో పరిధిలో 200 మొక్కలు చొప్పున నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిని డి.పుష్పమణి, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, పరిపాలన విభాగం సూపర్డెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్‌కు వెళ్లాలంటే ఈ గోతుల రోడ్డే దిక్కు

హాస్టల్ మార్గం.. గోతులమయం

జిల్లా కేంద్రమైన ఏలూరులో వేలాది మంది విద్యార్థులు వసతి తీసుకుంటున్న సంక్షేమ హాస్టల్‌కు వెళ్లే మార్గంలో గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ హాస్టల్‌లో 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే విద్యార్థినులు వసతి పొందుతున్నారు. హాస్టల్ నుంచి కాలు బయట పెట్టిన దగ్గర నుంచి మెయిన్ రోడ్డుకు వచ్చే వరకు అడుగడుగునా గోతులే. కాస్త వర్షం పడితే కాలుజారడం, రాళ్లు తగిలి ఇబ్బంది పడటం షరా మామూలైంది. జిల్లా అధికారులు కూత వేటు దూరంలో ఉన్నా విద్యార్థినుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. అమీనాపేట సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌కు వెళ్లే దారి దుస్థితికి అద్దం పడుతున్న చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు


ఈ రాళ్లపైనే రోజూ రాకపోకలు


వర్షపునీటితో నిండిన గోతులు దాటుకుంటూ వెళ్తున్న హైస్కూల్ విద్యార్థినులు

మండల స్థాయిలోనే సర్దుబాటు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను సవరించి మండల స్థాయిలోనే అన్ని కేడర్లను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియతో గందరగోళానికి గురి చేశారన్నారు. మండల స్థాయిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పని సర్దుబాటు చేయాల్సిన తేలికైన ప్రక్రియను ఆన్‌లైన్ పేరుతో కఠినతరం చేశారన్నారు. ఎస్జీటీలను ఇష్టారాజ్యంగా, బలవంతంగా పని సర్దుబాటు చేశారని, దీనివల్ల విద్యా సంవత్సరం మధ్యలో కొంతమంది ఉపాధ్యాయులు వందల కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.


విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఇప్పటికైనా మండల స్థాయిలోనే అన్ని కేడర్లను పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, కోశాధికారి జీవీ రంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

ఏకీకృత పెన్షన్ పథకాన్ని అమలు చేయడం ఉద్యోగుల హక్కుల కాలరాయడమేనని యూటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకీకృత పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కోటదిబ్బ ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని డిమాండ్లు వస్తున్న తరుణంలో ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేస్తూ యూపీఎస్ లాంటి అంకెల గారడీ స్కీమ్ తెరపైకి తెచ్చారని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని నినాదాలు చేశారు.

లైన్‌మేన్ అవినీతిపై విచారణ చేయండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పరిధిలోని గణపవరం లైన్‌మేన్ సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారని, అతని అవినీతిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని గణపవరానికి చెందిన చింతలపాటి మహేంద్ర అనే వినియోగదారుడు ముఖ్యమంత్రి, విద్యుత్ సంస్థ సీఎండీ, ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్, విద్యుత్ విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరంలోని జగన్నాథపురం ప్రాంతంలో ఒక వినియోగదారుని చెరువు వద్ద 1543311728000315 నంబర్ సర్వీస్‌కు సంబంధించి విద్యుత్ స్తంభాల్లో ఒకటి గత జూలైలో గాలివానకు విరిగి పోగా మరికొన్ని నేలకొరిగాయి. వాటిని తొలగించి, మరొక చోటుకు ఏ విధమైన షిఫ్టింగ్ చార్జీలు సంస్థకు చెల్లించకుండా విరిగిపోయిన వాటి స్థానంలో మరో స్తంభం వేయడంతో పాటు మరో ఆరు స్తంభాలను గణపవరం లైన్‌మేన్ పునరుద్ధరించారు. దీనికి విద్యుత్ సంస్థకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. గాలివానకు విరిగిన స్తంభాలను అదే ప్రాంతంలో రోడ్డుపై వేయడంతో అటుగా వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు. స్తంభాలు మార్చే కాంట్రాక్టును నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారు. ఈ ఒక్క వ్యవహారంలోనే లైన్‌మేన్ రూ.50 వేలు నుంచి రూ.60 వేలు లంచం అందుకున్నట్లు తెలిసిందని మహేంద్ర పేర్కొన్నారు. అధికారులు విచారణ చేస్తే ఇతని అవినీతి వ్యవహారం బయటపడుతుందని తెలిపారు. రోడ్డుకు అడ్డంగా వేసిన విరిగిన స్తంభాలను తొలగించాలని మహేంద్ర కోరారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదుకండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక సందర్భంలో అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకులందరూ త్వరితగతిన ఓటర్ల నమోదు చేయించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయిశ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ ఏలూరు జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యుల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2018 నవంబర్ 1వ తేదీ నుంచి 2024 నవంబర్ 1వ తేదీ మధ్య కాలంలో ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్ నమోదుకు అర్హులని తెలిపారు. ఓటరు నమోదుకు సెప్టెంబర్ 3 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీవీఎస్ఎల్ నారాయణ మాట్లాడుతూ ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ పవన్ కుమార్, సీనియర్ నాయకులు డీవీఏవీ ప్రసాదరాజు, జి.రవి చంద్ర మోహన్ తదితరులు మాట్లాడారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

అసెంబ్లీ స్థానాల పెంపు అంశంపై సాధన సమితి హర్షం

ఏలూరు (టూటౌన్): ఏపీ పునర్విభజన 2014 చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో శాసనసభ సీట్లు పెంపు విషయంలో స్పష్టత ఇచ్చిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ పాలిమేర హరికృష్ణ, రాష్ట్ర కన్వీనర్ నిడమర్తి నాగేశ్వరరావు, కోకన్వీనర్ నారపాము కిషోర్‌లు తెలిపారు. సమితి ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సమితి ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయినట్టు చెప్పారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం పదేళ్లలోపు అసెంబ్లీ సీట్లు పెంచుకోవచ్చని చట్టంలో పేర్కొన్నట్టు తెలిపారు. 2026 నాటికైనా అసెంబ్లీ సీట్లు పెరగనుండటం ఆనందదాయకమన్నారు. ప్రతి పార్లమెంటు స్థానం నుంచి రెండు అసెంబ్లీ సీట్లు చొప్పున ఏపీలో 50 సీట్లు, తెలంగాణలో 34 సీట్లు పెరుగుతాయని వివరించారు. సీట్లు పెంపు ప్రక్రియతో భౌగోళికంగా స్థానాలు మార్పులు, చేర్పులు జరిగి నిధులు, విధులు పెరిగి ఆయా ప్రాంతాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని తెలిపారు. సమావేశంలో పలువురు సమితి నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సిల్ట్‌తో ఇబ్బందులు


అంబికా థియేటర్ ప్రాంతంలో డ్రెయినేజీలో సిల్ట్ తీసి రోడ్డుపై వదిలేసిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల డ్రెయినేజీల్లో పేరుకు పోయిన చెత్త, చెదారం, సిల్ట్‌ను తీసి రోడ్డుపై వేశారు. సిల్టు గుట్టలను తొలగించకపోవడంతో నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు నగరంలో వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇది చాలదన్నట్టుగా డ్రెయినేజీలో తీసిన సిల్ట్‌ను రోడ్డుపైనే వదిలేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షానికి రోడ్డుపై వేసిన సిల్ట్ కరిగి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో వాహనచోదకులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక అంబికా థియేటర్ కెనాల్ రోడ్డు ప్రాంతంలో సిల్ట్ తీసి ఆరు రోజులు కావస్తున్నా తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతున్నారు.

పట్టించుకోని పాలకులు

ప్రభుత్వం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా.. ఇవేమీ నగరపాలక సంస్థ పాలకులు పట్టడం లేదు. పారిశుద్ధ్య నివారణ పనులు, రోడ్ల మరమ్మతులకు జనరల్ ఫండ్స్ నుంచి రూ.80 లక్షలు నిధులు కేటాయించామని గొప్పలు చెబుతున్నా.. ఆచరణలో అవి అగమ్య గోచరంగానే కన్పిస్తున్నాయి. తక్షణమే నివారణా చర్యలు చేపట్టి ప్రజలు కోరుతున్నారు.